# విచ్ఛిన్నాలను ఎదుర్కొంటూ, దీర్ఘకాల ఐక్య ఆందోళన ద్వారా వేతనాలు పెంచుకున్న వేటపాలెం ప్రాంత చేనేత కార్మికులు

**2014లో** జరిగిన మజూరీ పెంపు ఒప్పందం గడువు 2016 మార్చి నెలతో ముగుస్తుండటంతో, నూతన ఒప్పందం చేయాలని కోరుతూ గత 4 నెలలుగా వేటపాలెం ప్రాంత చేనేత కార్మికులు ఆందోళన సాగిస్తూ వున్నారు. 'ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం' ఆధ్వర్యంలో ఈపూరుపాలెం నుండి పందిళ్ళపల్లి వరకూ గల అనేక గ్రామాలలో చేనేత కార్మికులు డిమాండ్లను రూపొందించుకొని జనవరి 29వ తేదీన యాజమాన్య సంఘ (C-MAC సొసైటీ) అధ్యక్షునికి 1000 మంది కార్మికుల సంతకాలతో కూడిన డిమాండ్ నోటీసును అందచేశారు. అదేరోజు ప్రభుత్వాధికారులకు కూడా వినతిపత్రాలను అందచేశారు.

దాదాపు 2 నెలలపాటు స్పందించని కార్మికాధికారులు కార్మికుల ఒత్తిడి మేరకు మార్చి 22వ తేదీన చీరాల లేబర్ ఆఫీసు నందు చర్చల నిమిత్తం కార్మికులకు యజమానులకు సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ చర్చలకు కార్మికులు పెద్దసంఖ్యలో హాజరుకాగా, యాజమాన్య ప్రతినిధులు ముగ్గురు మాత్రమే హాజరయ్యారు.

ఈ వాతావరణంలోనే కార్మికులు తమ డిమాండ్లను యజమానుల, అధికారుల ముందుంచారు. తగినంతమంది మాస్టర్ వీవర్లు రానందున ఒక వాయిదా కావాలని యాజమాన్య ప్రతినిధులు కోరగా కార్మికులు అభ్యంతరం తెలిపారు. చివరకు మార్చి 30వ తేదీకి చర్చలు వాయిదాపడ్డాయి.

స్వయంగా యజమానులే వ్రాతపూర్వక హామీ ఇవ్వడంతో మార్చి 30వ తేదీన ఒప్పందం జరుగు తుందన్న ఆశతో దాదాపు 200 మందికి పైగా కార్మికులు చర్చలకు వచ్చారు. ఐతే యజమానులు మాత్రం చర్చలకు రాకుండా ముఖం చాటేశారు. ఐక్య కార్యాచరణ కమిటీ భాగస్వామ్య సంఘాలు కూడా గైర్హాజరయ్యాయి. అధికారులు చర్చల విషయం తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరించడంతో కార్మికులు ఆందోళనకు సిద్ధమయ్యారు. అదే సమయంలో చర్చలకు రావలసిన యజమానులు వారి సి–మాక్స్ కార్యాలయంలోనే ఉన్నారని గమనించిన కార్మికులు ఊరేగింపుగా అక్కడికి వెళ్ళి ఆందోళనకు దిగారు. మధ్యాహ్నం 12 గం॥ల నుండి సా॥ 5 గం॥ల వరకూ అన్నాహారాలు మాని తీవ్ర అనారోగ్య సమస్యలను సైతం లెక్కచేయక పట్టుదలగా ఆందోళన కొనసాగించారు.

ఈ పరిస్థితులలో యాజమాన్య ప్రతినిధిగా సి- మాక్స్ మాజీ అధ్యక్షుడు, చీరాల మున్సిపల్ వైస్ ఛైర్మన్ జోక్యం చేసుకొని ఏప్రియల్ 7వ తేదీన కార్మికులతో చర్చించి, ఒప్పందం జరిపే బాధ్యత తనదేనని హామీ ఇవ్వటంతో కార్మికులు తమ ఆందోళనను తాత్కాలికంగా విరమించారు.

ఏప్రియల్ 7వ తేదీన దాదాపు ఐదువందలమంది చేనేత కార్మికులు, మహిళలూ చర్చలకు హాజరయ్యారు. కార్మిక శాఖాధికారులు అర్ధాంతరంగా సమయాన్ని ఉదయం నుండి మధ్యాహ్నానికి మార్చినప్పటికీ, మండు టెండలను, వడగాల్పులను లెక్కచేయక కార్మికులు వందలాదిగా కదలిరావటం మజూరీ పెంపు విషయంలో వారు ఎంత బలమైన ఆకాంక్షతో ఉన్నారో స్పష్టం చేస్తోంది. ఐతే మళ్ళీ యజమానులు ముఖం చాటేశారు. దీంతో కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యజమానులను చర్చలకు రప్పించాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు ఉండటంతో కార్మికులు ఆగ్రహం పట్టలేక కార్మిక కార్యాలయంలోని బల్లలను, కుర్చీలను, పేపర్లను, ఫైళ్ళను అన్నింటినీ లాగిపారేశారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసు యంత్రాంగం రంగప్రవేశం చేసింది. కానీ కార్మికులు తమ పట్టు వీడకపోవడంతో కొందరు మాస్టర్ వీవర్లు చర్చలకు వచ్చారు. కార్మికులలో చీలికలు తెచ్చే ప్రతిపాదనలు ముందుపెట్టారు.

కార్మికుల మధ్య చీలికలు తెచ్చే ఈ వైఖరిని తామంగీకరించమని, తక్షణం ఒప్పందం చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు.

యాజమాన్యాల సేవకే అంకితమైన కార్మిక శాఖాధికారులు మాత్రం యజమానులతో అత్యంత మెతక వైఖరితో వ్యవహరిస్తూ కార్మికులకు ద్రోహం చేయ తలపెట్టారు. ఈ సమయంలో జిల్లా కార్మిక శాఖాధికారులు జోక్యం చేసుకొని మరుసటి వాయిదాకు తాముకూడా స్వయంగా హాజరై ఒప్పందం జరిగేట్లు చూస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

ఈలోగా ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం, ఏఐఎఫ్‌టియు–న్యూ నాయకులు జిల్లా కార్మికశాఖా ధికారులను (ఏసిఎల్, డిసిఎల్) కలవడం, కార్మికులు బృందాలుగావెళ్ళి జాండ్రపేట నుండి పందిళ్ళపల్లి గ్రామాల మధ్యనున్న యజమానులకు వినతిపత్రాలను అందజేసి, మరుసటి వాయిదాకు (ఏప్రియల్ 21వ తేదీన) తప్పనిసరిగా హాజరవ్వాలని కోరడంతోపాటు రాష్ట్రస్థాయి అధికారులకు మెమోరాండం కాపీలు పంపారు.

ఏప్రియల్ – 21వ తేదీన మిట్టమధ్యాహ్నం, మండుటెండలను సైతం లెక్కచేయక 800 మంది కార్మికులు, మహిళలు, కార్మికశాఖ కార్యాలయానికి చేరుకున్నారు. యజమానులు, అధికారులు కార్మికులతో సంబంధంలేకుండా విడిగా మాట్లాడుకుని

ఒప్పందం చేసుకునే ప్రయత్నం చేయగా, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నాయకత్వంలో కార్మికులు చొరవ తీసుకొని జనం మధ్యలోనే చర్చలు జరిపించేందుకు అన్ని పక్షాల వారిని ఒప్పించారు. రాత్రి 9 గం॥కు ప్రారంభమైన చర్చలు అర్ధరాత్రి 12 గం॥ల వరకూ సాగిన అనంతరం యజమానుల (సి–మాక్స్ సొసైటీ)కు – ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం, ఐక్య కార్యాచరణ కమిటీకి మధ్య ఒప్పందం జరిగింది. వేతనాలను పెంచుకోగలిగారు. ఒప్పందం పూర్తయ్యేంతవరకూ కార్మికులు ఎటూ కదలకుండా పట్టుదలగా వుండటం, వేతన సమస్య యొక్క తీవ్రతను, మజూరీ పెంపు పట్ల కార్మికుల ఆకాంక్షను, వారి ఐక్య పోరాటశక్తిని బలంగా వ్యక్తీకరించింది.

పదే పదే చర్చలకని పిలిచి ఆందోళనను నీరుగార్చే పద్ధతులను, పరిణామాలను ఎప్పటికప్పుడు కార్మికులకు ఎరుక పరుస్తూ సంఘ నాయకత్వంలో జరిగిన విస్తృత రాజకీయ ప్రచారం కారణంగా యజమానుల కుట్రలన్నింటినీ భగ్నం చేయగలిగారు. వాయిదావాయిదాకు అంతకు రెట్టింపు సంఖ్యలో కార్మికులు, మహిళలూ కదలడం పట్టుదలగా పోరాడటం ద్వారానే ఈ ఒప్పందాన్ని సాధించుకున్నారు. ఒప్పందాన్ని సాధించుకున్న చేనేత శ్రమజీవులందరికీ ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం విప్లవ జేజేలు పలుకుతోంది. అయితే ఈ ఒప్పందాన్ని అలంకార ప్రాయంగా కాకుండా పకడ్బందీగా అమలు జరిపించు కునేందుకు మరింత పట్టుదలతో, దీక్షతో అమలు చేయించుకోవటానికి సన్నద్ధం కావలసి వుంది.

ooooo